1నుంచి ముఖ ఆధారిత హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగులకు జనవరి ఒకటో తేదీ నుంచి ముఖ ఆధారిత హాజరు అమలు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వివిధ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమగు నివేదికలను సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాల్లో చేపడుతున్న పేదలందరికీ ఇళ్లు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, పేదలు గృహప్రవేశాలు చేయాలని ఆయన అన్నారు. రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు, గ్రామ సచివాలయాల నిర్మాణాల్లో పురోగతి పెంచాలని సూచించారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో తొలకరి పలకరింపు... ప్రకృతి అనుకూలత వెరసి ఈ ఏడాది ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల పంట పండింది. వరితోపాటు దాదాపు అన్ని పంటలూ ఆశాజనకంగా సాగయ్యాయి. అయితే పెట్టుబడులే ఆకాశాన్ని అంటాయి. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేదు. దీనికి తోడు అనేక మంది రైతులకు రైతు భరోసా, పిఎం కిసాన్ పథకాలు వర్తించలేదు. మార్కెట్ సదుపాయాలూ లేక పోవడంతో ఎప్పటి మాదిరిగానే రైతన్న దళారులు, వ్యాపారుల వలలో చిక్కుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా అధిక వర్షాలకు జిల్లాలో పలు చోట్ల మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లడంతో అన్నదాత కుదేలయ్యాడు. పాలకుల పుణ్యమా అని జిల్లాలో ఉండే ఏకైక చక్కెర కర్మాగారం ఎన్‌సిఎస్ మూతపడడంతో చెరకు సాగు అమాంతం తగ్గిపోయింది.

- అధిక వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి
- తగ్గిన ఖరీఫ్ సాగు
- గిట్టుబాటు ధర లేక గిలగిల
- అధ్వానంగా మారిన అన్నదాత పరిస్థితి

ఒడిదొడుకుల వ్యవ'సాయం'

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లలో ఈ ఏడాది 2లక్షల12వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి అత్యధికం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా71,760 ఎకరాల్లో సాగైంది. దీనికి వాతావరణం కూడా అనుకూలించింది. సరిగ్గా ఉబాల సమయంలో కాస్త వర్షాలు అటు ఇటుగా అయినా ఆగస్టు చివరి నాటికి అంతా అనుకూలంగా మారింది. సెప్టెంబర్లో కురిసిన వర్షాలకు కాస్త పంటలు దెబ్బతిన్నప్పటికీ కాస్తా ఆశాజనకంగానే కనిపించింది. గత ఐదేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది సకాలంలో పంటలు సాగు చేయడం విశేషంగా చెప్పవచ్చు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు, సగటు దిగుబడి ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. సగటున ఎకరాకు 2,110 కిలోలు (26 బస్తాలు) ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కగట్టారు. అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఈ ఏడాది పెరిగాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ధరల కారణంగా వీటితో నడిచే యంత్రాల నిర్వహణ భారంగా మారింది. ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగాయి. ఎప్పటి మాదిరిగానే ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోయాయి. వరి సాగుపై ఎకరాకు రూ.40వేల నుంచి రూ.45వేల వరకు ముదుపు అయ్యిందని ఇటీవల రైతు సంఘం నాయకులు చేపట్టిన సర్వేలో తేలింది. అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి అన్నట్లుగా పెట్టుబడులు పెరిగినప్పటికీ ఆ స్థాయిలో ధాన్యంపై ధర పెరగలేదు. రైతులకు మద్దతు 'పేరుతో రూ.2,040, ఎ-గ్రేడ్ కు రూ.2,060 కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే పెరిగింది. కేవలం రూ.100 మాత్రమే. మరోవైపు ఆర్‌బికెల ద్వారా ప్రతి ధాన్యపుగింజకొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వ యంత్రాంగం ప్రగల్బాలాలు పలికినప్పటికీ, ఆచరణ గడపదాటడం లేదు. సకాలంలో కొనుగోలు చేయకపోవడం రైతులు కళ్లాల్లోనే వాటికి కాపలా కాసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి కూడా సకాలంలో చెల్లింపులు చేయలేదు. పండగ దగ్గరపడుతున్నా పైసలు ఇవ్వకపోవడంతో రైతు కుటుంబాల్లో ఒకింత నిరాశ. అంసతప్తి నెలకొంది.

జిల్లాలో వరి తర్వాత అంతటి ప్రాధాన్యత గల పంట పత్తి. ఈ ఏడాది సుమారు 18 వేల ఎకరాల్లో సాగైంది. పలుమార్లు కురిసిన భారీ వర్షాలకు కొంత దెబ్బతిన్నప్పటికీ గతేడాది మాదిరిగానే ఈ ఏడాది ఉత్పత్తి ఆశాజనకంగానే వచ్చింది. అయితే మద్దతు ధరలేక, కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో దళారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కజొన్న ఈ ఏడాది సుమారు 14240 ఎకరాల్లో సాగైంది. కానీ వాటి కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో రైతులు పూర్తిగా దళారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలకుల పుణ్యమా అని జిల్లాలో ఏకైన చక్కెర కర్మాగారం ఎన్‌సిఎస్ సుగర్స్ మూతపడడంతో చెరుకు సాగు చాలా వరకూ తగ్గిపోయింది. గతేడాది 1181 ఎకరాల్లో చెరకు సాగవ్వగా, ఈ ఏడాది 871ఎకరాలకు పడిపోయిందంటే ఈ పంట సాగుపై రైతులకు ఏడాదికి ఏడాది ఆసక్తి తగ్గిపోతున్నందుకు ఇదే నిదర్శనం. నువ్వులు, వేరుశనగ, ఇతర అవరాల సాగు, గిట్టుబాటు ధరలు కూడా ఇదే పరిస్థితిలో ఉండడం వల్ల పంటలు నిండుగావున్నా కడుపు నిండని పరిస్థితి ఏర్పడింది.

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన పంటలు (ఎకరాల్లో)		
పంట.	2022	2021
వరి	68704	72887
పత్తి	7240	8891
జొన్న	5788	7256
చెరకు	871	1181

258 ఎకరాల్లో పంటనష్టం

అక్టోబర్లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 258ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. ముఖ్యంగా వందలాది ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. సరిగ్గా కోత దశకు వచ్చిన మొక్కజొన్నపై ఎడతెరిపిలేని వర్షం కురవడంతో మొక్కలు మొలిశాయి. పత్తి పంట కూడా చాలా చోట్ల నేల కొరిగింది. 15 మండలాల పరిధిలోని 279 రైతులకు చెందిన వరి పంట 2,22.5ఎకరాలు, పత్తి 13.7 ఎకరాలు, మొక్కజొన్న 15ఎకరాల్లోనూ నీటమునిగినట్టు అధికారులు గుర్తించారు. మరోవైపు రైతు భరోసా అందని రైతులు ఎక్కువగానే ఉన్నారు. బ్యాంకు ఖాతాలు ఇన్ యాక్టివ్‌గా ఉన్నాయని, బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్లు లింకు కాలేదని, ఆదాయ పన్ను పరిధిలో ఉన్నారనే సాకులతో జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ యోజనకు ఎగనామం పెట్టింది. రైతులు ఎటు చూసినా ఆర్థిక ఇబ్బందుల్లోనే ఉన్నారు.

జీడి ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ట్రైఫాడ్ చైర్మన్ రామ్ సిన్హా రత్వ

ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు తయారుచేసే ఉత్పత్తులకు ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ట్రైఫాడ్ చైర్మన్ రామ్ సిన్హా రత్వ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఐటిడిఎలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఐటిడిఎలో డిడివికెల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీడి, పసుపు, చీపుర్లు ప్రొసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. తయారుచేసే విధానాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అగరబత్తీ, బిస్కట్లు, తేనె, చిప్స్ తయారీ యూనిట్లను కూడా పరిశీలించారు. అనంతరం యూనిట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీతంపేటలో ప్రొసెసింగ్ యూనిట్ల నిర్వహణ చాలా బాగుందని, వేరే రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందని అన్నారు. వేరే రాష్ట్రాల గిరిజనులను ఇక్కడికి తీసుకొచ్చి సీతంపేటలో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. ఫైనాఫిల్ జ్యూస్ ప్రొసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. మార్కెటింగ్ కోసం ట్రైఫాడ్ నుంచి పూర్తి సహకారం అందించి, లాభాలు వచ్చేలా చర్యలు తీసుకొంటామని అన్నారు. అనంతరం జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ మాట్లాడుతూ విడివికెల నిర్వహణలో సీతంపేట యూనిట్లు బాగున్నాయని అన్నారు. వీటి నిర్వహణకు నిధులు ఇచ్చేందుకు జిసిసి సిద్ధంగా ఉందన్నారు. తొలుత ఐటిడిఎ పిఒ బి.నవ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీతంపేటలో నిర్వహిస్తున్న 68 విడివికెల అభివృద్ధి, పనితీరు నివేదికను వివరించారు. కార్యక్రమంలో ట్రైఫాడ్ ఆర్ఎం శ్రీనివాసరావు, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, వైకెపి ఎపిడి బి.నారాయణరావు, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కురుపాం

రాజీ మార్గమే సులభ పరిష్కారం స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఫిబ్రవరి 11 వ తేదీన నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని గురువారం జ్యూడిషియల్ పస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈ.ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సంబంధిత తగాదాలు, రాజీ పడ్డదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని అన్నారు.

ఒకవైపు పనులు...మరోవైపు రాకపోకలు

ఎన్ హెచ్ అధికారుల నిర్వాకంతో వాహనచోదకుల అసంతృప్తి

ప్రజాశకి - సాలూరు

చాలాకాలం తర్వాత జాతీయ రహదారి 26నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాచిపెంట మండలం పి.కోనవలస నుంచి సాలూరు పట్టణ పరిధి వరకు రహదారి నిర్మాణం జరుగుతోంది. గోతులతో నిండిన రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు పనులు జరుగుతున్నా నాణ్యత మూణ్ణాళ్ల ముచ్చటగా మిగులుతుందేమోనని ప్రజలు భావిస్తున్నారు. గత నాలుగు రోజులు గా పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై పనులు సాగుతున్నాయి. ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతుంటే వెనువెంటనే వాహనాల రాకపోకలు జరిగిపోయాయి. అసలే వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగే ఈ రహదారి నిర్మాణ పనులను రాత్రివేళల్లో చేసివుంటే కొంతవరకు వాహనాల రద్దీ తగ్గేది. పట్టపగలు ఒకవైపు రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడం, వెనువెంటనే వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో రహదారి నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. గతంలో వాహనాల రద్దీ ఎక్కువగా వుండే జాతీయ రహదారిపై పనులు రాత్రివేళల్లో జరుగుతుండేవి. కానీ ఇప్పుడు పట్టపగలు వాహనాల రాకపోకలు ఎక్కువగా వున్న సమయంలో పనులు జరుగుతుండడం పై పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతీయరహదారుల ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడడంతో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిటి రహదారి నిర్మాణంలో భాగంగా రోలర్‌తో రోలింగ్ కూడా సరిగ్గా లేకపోవడం, వెంటనే వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో రహదారి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు పనులు చేస్తుండగా పక్క నుంచి వెళ్తున్న వాహనాలు

రీ సర్వే వేగవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్

రీ సర్వే వేగవంతం చేయాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. రీ సర్వేపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విభాగాల వారీగా సిబ్బందిని నియమించాలని తద్వారా వేగవంతం కాగలదని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారని ఆయన వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా సర్వే, సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్, కలెక్టర్ కార్యాలయ విభాగాల పర్యవేక్షకులు జ్ఞాన వేణి, శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం హెడ్ క్వార్టర్స్ డిఎస్‌పిగా బలివాడ నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ పోలీస్ అకాడమీ, ఇంటిలిజెన్స్ విభాగాల్లో పని చేశారు. పదోన్నతిపై హెడ్ క్వార్టర్స్ డిఎస్‌పిగా నియమితులయ్యారు.

రేషన్ డిపోను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ నాయక్

సక్రమంగా బియ్యం సరఫరా చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ దేవుళ్ళ నాయక్ డీలర్లకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని పలు రేషన్ డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏ ఒక్క డీలర్ సక్రంగా బియ్యం పంపిణీ చేయకపోతే తమకు ఫిర్యాదు చేయవచ్చునని కార్డుదారులకు సూచించారు. బియ్యం తూనికలో ఎటువంటి వ్యత్యాసాలున్నా అందుబాటులో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. సమయపాలన పాటించి కార్డుదారులకు అందుబాటులో ఉండి సక్రంగా బియ్యం పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని డీలర్లను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ జి.ప్రసాదరావు ఉన్నారు.

రేషన్ డిపో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

అదనంగా తూనిక వేస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మిల్లర్లు అదనంగా ధాన్యం మరోసారి తూనికలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ గ్రామీణ వ్యవసాయ సహాయకులను హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 80 కేజీల 180 గ్రాముల ధాన్యం మాత్రమే తూనిక వేయాలన్నారు. అధికంగా ధాన్యం కొలిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇబ్బందు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల నుంచి నిర్ణీత కొలతల కంటే అధికంగా ధాన్యం తూనికలు వేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అది మరోసారి పునరావృతం రాకుండా చూసుకోవాలన్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వాహనాలు రప్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కె.మన్మధరావు, ఎఇఒ బి.కృష్ణకాంత్, విఎఎలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని నాగవంశం వీధిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉచిత రేషన్ బియ్యం దుకాణాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం సందర్శించారు. స్టాక్ కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవం సందర్భంగా అందిస్తున్న ఉచిత బియ్యం పథకంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ద్వారా కరోనా సమయంలో సైతం ఇబ్బందులు పడకుండా ఆహారం లభించిందని లబ్ధిదారులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. అలాగే మండలంలోని తుమరాడ గ్రామంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కురుపాం : జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి గౌతు లచ్చన్న జలాశయం వద్ద మత్స్య శాఖలో పిఎంఎంఎస్‌వై స్కీం ద్వారా మంజూరైన చేప పిల్లలను గురువారం ఆమె విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని, కావున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి ఉరిటి రామారావు, మత్స్యశాఖ సిబ్బంది,నాయకులు పాల్గొన్నారు.

మృతులకు టిడిపి సంతాపం

పార్వతీపురంరూరల్ : నెల్లూరు జిల్లా కందుకూరిలో బుధవారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 8మంది టిడిపి కార్యకర్తలకు స్థానిక టిడిపి నాయకులు సంతాపం తెలిపారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మృతులకు రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జనవరి 27 నుంచి టిడిపి రాష్ట్ర కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, బోను చంద్రమౌళి, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుడుతున్నామని, ఇందులో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబులతో విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. స్థానిక మినీ గురుకులం పాఠశాల ఆవరణలో గురువారం ఉచిత ట్యాబులు పంపిణీ చేశారు. మండలంలో 16 పాఠశాలలకు గానూ 702 మంది విద్యార్థులకు, 43 మంది ఉపాధ్యాయులకు ట్యాబులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబులతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. ప్రస్తుతం డిజిటల్ విద్య కంప్యూటర్ విద్య నడుస్తుందన్నారు. అలాగే పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె ముత్యాలనాయుడు, నాయకులు పి.వీరంనాయుడు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, ధనుంజయ్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎఇఒ పి.జోగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని విద్యా కమిటీ చైర్మన్ నిమ్మక కాంతారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు.. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ సుభాషిని, రాము, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పిటిజి) విద్యార్థులకు ట్యాబ్‌లను ఎల్విన్ పేట సర్పంచ్ ఆర్ చైతన్య ప్రవంతి పంపిణీ చేశారు.

సీతంపేటలో విద్యార్థులకు ట్యాబ్‌ను అందజేస్తున్న పిసి చైర్మన్ కాంతారావు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో డిప్యూటీ సిఎం రాజన్న దొర

విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించేందుకు ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.కమల కుమారి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, డిప్యూటీ వార్డెన్ బి.గిరిజ, సచివాలయం కార్యదర్శి శ్యామల తదితరులు ఉన్నారు.

పాలకొండ రూరల్ : మండలంలోని వెంకంపేటవీధి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం పరాంకుశంనాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి ఆకుల కుమార్, 20వ వార్డుల కౌన్సిలర్ ప్రతినిధులు పడాల రాంబాబు, గంటా సంతోష్‌కుమార్, పేరెంట్ కమిటీ వైస్ చైర్మన్ నీలకంఠం, రామారావు, వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లుంబూరు ఎంపీయూపి పాఠశాలలో......

మండలంలోని లుంబూరులో గల మండల పరిషత్ ప్రాథమిక పాటశాలలో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, మాజీ సర్పంచ్ రౌతు చంద్రినాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ రౌతు చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మాధురి, ఉమెన్ పోలీస్ దేవి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ నవ్య

ఆస్పత్రిని సందర్శించిన పిఒ

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిని ఐటిడిఎ పిఒ బి.నవ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కోవిడ్ దృష్ట్యా వెంటిలేటర్‌తో కూడిన 10 బెడ్‌లను సిద్ధం చేయాలన్నారు. ఈ10 బెడ్‌లకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలన్నారు. ఆక్సిజన్ సిలిండర్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎంజెబివై చెక్కు అందజేత

మక్కువ : ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా మండలంలోని బంగారువలసకు చెందిన కర్రి తిరుపతమ్మకు రూ.రెండు లక్షల చెక్కును అందజేసినట్లు ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ శ్రీనుబాబు తెలిపారు. గురువారం స్థానిక సర్పంచ్ శంబంగి హరికృష్ణ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేసినట్లు తెలిపారు. తిరుపతమ్మ భర్త సత్యనారాయణ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఎపిజిబి బ్యాంకులో ఆయన పొదుపు ఖాతా తెరిచి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో అప్పట్లో రూ.330 చెల్లించారు. ఆయన అకాల మృతి అనంతరం నామినీగా ఉన్న భార్య తిరుపతమ్మకు చెక్కును అందజేశామన్నారు. ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 777 రోజులకు గాను ఫిక్స్ డిపాజిట్లు పై 8 శాతం వడ్డీ తమ బ్యాంకు అందిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

నిరుపేదలకు ఆర్థికసాయం అందజేస్తున్న సంజీవనాయుడు

నిరుపేద కుటుంబాలకు వితరణ

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో మూడు నిరుపేద కుటుంబాలకు రూ.10వేలు వితరణను చీపురుపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుడివాడ ఈశ్వరకుమార్ పెదపెంకిలో బాపూజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు, యూత్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్‌నాయుడు మాట్లాడుతూ వేరే గ్రామమైనప్పటికీ తన స్నేహితుడు పెనుబోతు దుర్గారావు చెప్పిన మాట విని సాయం చేయడం గర్వించ దగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఓటేటి మల్లేష్, బొంతలకోటి అప్పలనాయుడు, ఆర్ఎంపి ఎం.శ్రీనివాస్, కొల్లి శివ, కెంగువ కృష్ణచంద్ర, ఎం.నరసింహులు పాల్గొన్నారు.

కాశీ పేట వద్ద కాటాను ప్రారంభిస్తున్న ఎజిఎం అప్పారావు

కాశీపేట వద్ద చెరకు కాటా

సీతానగరం : మండలంలోని కాశీపేట వద్ద సంకిలి షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన చెరకు కాటాను ఎజిఎం జి.అప్పారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు తూనిక కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేశామని, ఇంకా ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు కూడా చేస్తామన్నారు. ఈ కేంద్రాల వద్దకు రైతులు చెరకు సరఫరా చేసి అందిస్తే ఫ్యాక్టరీ ప్రకటించిన ధర రైతుకు నేరుగా అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ కాజీపేట, లక్ష్మీపురం, బూర్జ గ్రామాల్లో తూనిక కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు మురళి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య సూచించారు. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన రైతులకు 90 శాతం సబ్సిడీపై మూడు వ్యవసాయ పంపుసెట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూనిట్ ధర రూ.86 వేలు కాగా 90 శాతం సబ్సిడీ వీటిని పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ యూనిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, పిఎఒ హరికృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

5న మండల సర్వసభ్య సమావేశం

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023 జనవరి 5న మండల సర్వసభ్య సమావేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి డి.వెంకటరమణాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని, సర్పంచులు, ఎంపిటిసిలతో మండల స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సచివాలయ పనితీరు పట్ల అసంతృప్తి

పాలకొండ : మండలంలోని తంపటాపలి సచివాలయాన్ని డివిజన్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారి వివి గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. సచివాలయం పనితీరు పట్ల అసంతృప్తి చెందారు. సిబ్బంది హాజరు పట్టి, మూమెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ఆయుష్మాన్ భవ యాప్ నమోదు శాతం తక్కువగా ఉందని అసహనం చెందారు. యూనిఫాంలు వేసుకోకపోవడం పట్ల మందలించారు. క్రమశిక్షణరాహిత్యంగా వ్యవహరిస్తే ఎలా అన్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునే బాధ్యత మహిళా పోలీసు, కార్యదర్శిపై ఉందన్నారు.

సీతంపేటలో భూ రీసర్వే

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాం పరిధిలో గల సీతంపేటలో తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్ డ్రోన్ కెమెరా ద్వారా భూ రీసర్వేను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సరిహద్దులు డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేసి మ్యాప్ పాయింట్ల ఫొటోల ద్వారా ఇవ్వడంతో రెవెన్యూ అధికారులకు గ్రామ సరిహద్దులు, మ్యాపింగ్ గుర్తించడం సులభతరమవుతూ పని ఒత్తిడి తగ్గుతూ పక్కపక్క గ్రామాల రైతులకు భూ తగాదాలు లేకుండా ఉంటుందని అన్నారు. కార్యక్ర మంలో సర్వేర్ రవికుమార్, విఆర్ఒ మెరకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

'యువశక్తి' జయప్రదం చేయండి

వీరఘట్టం : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో జనవరి 12న జరగనున్న యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన ఉత్తరాంధ్ర క్రియాశీలక నాయకులు బిపి నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని నడుకూరులో గురువారం యువశక్తి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యువతను రాజకీయాల్లోకి అడుగు వేయించాలనే తపనతో యువశక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.పుండరీకం, జానీ, పొట్నూరు రమేష్, అల్లు సాయిరాంకుమార్, అనిల్, సాయి ప్రశాంత్ పోరెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

రాజకీయాలకతీతంగా పథకాలు అందజేయాలి

ప్రజాశక్తి - కురుపాం

రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందజేయాలని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం స్థానిక కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల వద్ద వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికీ చేరుస్తాన్నామని గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలు వెళ్లినప్పుడు యువత ఉద్యోగాలు లేకుండా తల్లిదండ్రులకు భారమైనటువంటి పరిస్థిత ఉండేదని కాని అన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సిసి రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. కావున సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు ప్రతి గడపకు సంక్షేమ పథకం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కో-ఆప్సన్ సభ్యులు షేక్ నిషార్, జడ్పిటిసి జి.సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి అంధవరపు కోటేశ్వరరావు, వైస్ ఎంపిపి లు రంగారావు, అన్నాజీ రావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్,


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, ఆయుర్వేద కార్పొరేషన్ డైరెక్టర్ జి. విజయ చంద్రశేఖర్, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్.వెంకటరావు, ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, స్వామినాయుడు, సర్పంచులు ఎంపిటీసీలు, సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ చెల్లించకపోతే అపరాధ రుసుం

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని వ్యాపారులు తమ వాణిజ్య వ్యాపారాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్సులు గడువులోగా చెల్లించకపోతే అపరాధ రుసుంతో చెల్లించాల్సిన వస్తుందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు పట్టణ ప్రధాన రహదారిలో ఉన్న పలువురు వ్యాపారస్తులతో అన్నారు. గురువారం పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల ట్రేడ్ లైసెన్స్ బకాయిలపై మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురళితో పాటు, ఆయా పరిధిలో ఉన్న సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కలిసి ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వ్యాపారులతో మాట్లాడుతూ, ఇంతవరకు లైసెన్సులు చెల్లించని వ్యాపారులు డిసెంబర్‌లోపు తక్షణమే చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. లైసెన్స్ చెల్లించిన వారు షాపుల వద్ద లైసెన్స్ చెల్లించిన కాపీని ఉంచాలని, ఇంకా లైసెన్స్ చెల్లించని వ్యాపారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నేడు వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నియోజకవర్గంలోని కన్వీనర్ల నియామకం చేపట్టిన అనంతరం నియోజ కవర్గ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతుందని ఎమ్మెల్యే ఎ.జోగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో నాయకులు, అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, ఉమ్మడి జిల్లాలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శోభా హైమావతి సమక్షంలో నియోజకవర్గంలో గల 76 సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అందరితో కలిసి స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున ప్రతి సచివాలయం పరిధిలో గల ఆయా గ్రామాల నుంచి తప్పనిసరిగా సమయానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, సచివాలయాలు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు..

రేషన్ డిపోలను సందర్శించిన డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో కిచ్చాడ, శివన్నపేటలో గల రేషన్ దుకాణాలను డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని లబ్ధిదారులకు అందజేయాలన్నారు. వివిధ సేవల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వైకెపి కార్యాలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతూ వైయస్సార్ చేయూత మహిళా మార్టులపై సమీక్షించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు సీసీలు, విఒఎలు చొరవ తీసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మహిళా మార్టులు ఎంతో ఉపయోగపడతాయని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ మార్టుల ఏర్పాటుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం ఇవి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ కాలనీ పట్టాదారులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పట్టణ సమీపాన గల గోపాలపురం గ్రామ రహదారిలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ కాలనీ పట్టాదారులకు న్యాయం చేయాలని జనసేన జిల్లా నాయకులు స్థానిక తహశీల్దార్ శివన్నారాయణను కోరారు. గురువారం వారు తహశీల్దార్‌ను కలిసి గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో పట్టాలు పొంది పేదరికం వల్ల ఇళ్లు కట్టుకోలేని వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో పట్టణానికి చెందిన కొంతమంది పేదలకు ఇళ్లపట్టాలి ఇచ్చారన్నారు. అందులో కొంతమంది పేదరికం వల్ల కట్టుకోలేకపోయారని, మరికొంతమంది పునాదుల వరకు కట్టి ఇంటి నిర్మాణం చేపట్టలేకపోయారని అన్నారు. ప్రస్తుతం ఇళ్లు కట్టలేని వారి స్థలాల్లో కొత్త లబ్ధిదారులకు పట్టాలిచ్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పేదరికంతో ఇళ్లు కట్టలేని పేదలకు సహాయం చేయాలి తప్ప ఉన్నది లాక్కోవడం సరికాదన్నారు. అంతేకాక కనీసం నోటీసు ఇవ్వకుండా పట్టా రద్దు చేయకుండా వారి అనుమతి తీసుకోకుండా ఇలా చేయడం సరికాదన్నారు. కొంతమంది సిబ్బంది లబ్ధిదారు పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే వారి స్థలాలు వారికి అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శివన్నారాయణ మాట్లాడుతూ అటువంటివి 15 వరకు తమ దృష్టికి వచ్చాయని, వీటిపై దర్యాప్తు చేయించి నిక్కచ్చిగా ఉన్న వాటికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, గ్రీన్‌ఫీల్డ్ కాలనీ పట్టాదారులు పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంతో వాలంటీర్లు పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమం పథకాలు అర్హులైన వారికి అందేలా ఉరుత్సాహంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి గ్రామ వాలంటీర్లకు సూచించారు. స్థానిక ఒకటో సచివాలయం రిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మర్రి వీధిలో పర్యటించినప్పుడు వీధి చివర్లో చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో కంపును భరించలేకపోతున్నామని దోమల బారిన పడి వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే వీధిలో ఓ మహిళ నాలుగేళ్లైన అమ్మఒడి పథకం వర్తించలేదని, తనకు సెంటు భూమి లేకపోయినా ఐదు ఎకరాలు భూమి ఉందని

స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి

ఆన్లైన్లో చూపించడంతో ఈ పథకం కోల్పోయామని ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. దీనికి ఎమ్మెల్యే స్పందించి అక్కడే ఉన్న విఆర్ఓ సురేష్ కుమార్‌ను పిలిచి ఈ సమస్య పరిష్కరించి ఆమెకు అమ్మ ఒడి పథకం వర్తించలా చేయాలని ఆదేశించారు. అలాగే కూరాకుల వీధి, ముచ్చర్ల, పెద్ద చాకలి , దుర్గపేట , తదితర వీధుల్లో ఉన్న ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల పై వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి గౌరమ్మ, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు డి లలితకుమారి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కేవెల్ ప్రసాదరావు నాయుడు, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో విత్తన బంతులు ఉత్తమం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాభావ పరిస్థితుల్లో విత్తనాలను విత్తనబంతులుగా తయారుచేసి పొలాల్లో వేసుకోవడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని ప్రకతి వ్యవసాయం సబ్ డివిజన్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ అన్నారు. గరుగుబిల్లి మండలం సంతోషపురం రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనబంతుల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విత్తనబంతులు తయారు చేయడానికి విత్తనం, బీజామృతం, బంక మట్టి, పొయ్యి బుగ్గి పదార్థాలను వినియోగించాలన్నారు. ఐదు నుంచి ఆరు రకాల విత్తనాలను తీసుకుని వీటిని బీజామృతంలో విత్తనశుద్ధి చేసి వాటికి సరిపడినంత బంకమట్టి, కట్టెల బూడిదతో బంతులు రూపంగా తయారు చేస్తున్నట్టు తెలిపారు. విత్తనానికి ఒక కవచం ఏర్పడుతుందని పక్షులు బారిన పడకుండా, సూర్య రశ్మి తగలకుండా ఉంటుందని క్రిమి కీటకాలు కూడా దరి చేరవని అన్నారు. ఆరు నెలల వరకు విత్తనబంతులకు నష్టం జరగదన్నారు. అనుకోకుండా వర్షాలు పడిన, తేమ ఎక్కువగా ఉన్న భూమిలో ఉన్న విత్తనబంతులు

విత్తనబంతులు తయారీపై అవగాహన కల్పిస్తున్న యాంకర్‌పర్సన్

మొలకెత్తుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు కనీసం ఐదు ఎకరాల్లో విత్తన బంతులు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిఎలు హరీష్, రైతులు ఉన్నారు.

31లోగా పిఎం కిసాన్ ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అర్హులైన రైతులకు, కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అందరికీ ఈనెల 31లోగా ఇకెవైసి చేయించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సూచించారు. గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై ప్రతినెలా పనితీరుపై సమీక్ష చేసి నివేదికను జిల్లా వ్యవసాయాధికారికి పంపడం చేయడం జరుగుతుందని, కావున వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేయాలని, ఎప్పటికప్పుడు రైతుల సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు ఇంకా ఇకెవైసి చేసుకోలేని రైతులందరికీ ఇకెవైసి ఈనెల 31లోగా పూర్తి చేయిస్తే పిఎం కిసాన్‌కు అర్హులవుతారన్నారు. కావున ఈ విషయం రైతులందరికీ తెలియజేయాలని కోరారు. పద్మాపురం, మరికొన్ని గ్రామాల్లో రైతులు ఒకే ఫోన్ నెంబర్‌తో పిఎం కిసాన్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, కానీ ప్రతి రైతు విధిగా తమ ఫోన్ నెంబర్‌ను ఆధార్తో అనుసంధానం చేయించుకుని ఇకెవైసి పూర్తి చేయించుకుంటేనే అర్హులవుతారని కాబట్టి అలాంటి రైతులు అందరికీ తెలియజేయాలని అన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు, అక్కడక్కడ కత్తెర పురుగు ఆశించిందని క్షేత్ర ప్రదర్శనలు చేసి నివారణ చర్యలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఒ రెడ్డి హైమావతి, విఎఎలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలు

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలను సులువుగా సాధించవచ్చునని ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు చెప్పారు. గురువారం స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో మానవతా విలువలు అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థుల్లో క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. సెల్ ఫోన్, టీవీలకు దూరంగా వుండాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి అంకితభావంతో చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిత్యం పర్యవేక్షణ వుండాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం పిట్టా రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవులను పొడిగించాలి

పార్వతీపురం టౌన్ : పాఠశాలలకు ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులను జనవరి 18 వరకు పొడిగించాలని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి ఎం.శివార్జున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు గురువారం లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు వారు తెలిపారు. పాఠశాలలకు జనవరి 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారని, అయితే అతి ప్రాముఖ్యమైన సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల్లో ఉన్న స్వగ్రామాలకు, పండుగ సందర్భంగా విద్యార్థులు వారి బంధువుల ఇళ్లకు వెళ్తారన్నారు. అంతేకాక కనుమ పండుగ మరుసటి రోజునే పాఠశాలలు ప్రారంభించినప్పటికీ విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుందన్నారు. కాబట్టి సంక్రాంతి సెలవులను కనీసం రెండు రోజుల పాటు 18 వరకు పొడిగించి నట్టైతే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని విద్యాశాఖ మంత్రిని లేఖలో కోరినట్లు సామల పేర్కొన్నారు..

పలు గ్రామాల్లో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గొయిది పంచాయతీ జక్కరవలస, సవర "ఇదేం కర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమం సీతంపేట మండలం గొయిది పంచాయతీ జక్కరవలస, సవర గొయిది, పత్తికగూడ గ్రామల్లో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా మందికి పెన్షన్లు పీకేశారన్నారు. ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవర ముఖలింగం, సవర మంగయ్య, తిరుమల, వెంకయ్య, శ్రీను, భాస్కర్, రవి లోకేష్, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల ఉపాధ్యక్షులు బిడ్డిక స్వామినాయుడు, సుబ్బారావు, నిమ్మక చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఇదేంకర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ, వారి అభిప్రాయాలను సేకరించారు. ఆ తర్వాత గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని, అభివృద్ధి పథంలో ఉన్న రాష్ట్రాన్ని అవకతవక నిర్ణయాలతో కంపెనీలను వెళ్లగొట్టి రాష్ట్ర భవిష్యత్తు అధోగతి పాల్జేసారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, కెంగువ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి అన్నారు. గురువారం స్థానిక 20వార్డులో ఇదేం కర్మ కార్యక్రమంలో ఆమె పర్యటించారు. వార్డు పరిధిలోని వీధుల్లో తిరుగుతూ

పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. గడచిన మూడేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితుల్లో వున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు. కార్యక్లమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, కౌన్సిలర్ కె.వరలక్ష్మీ, మాజీ కౌన్సిలర్లు అన్నపూర్ణ, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని నీలకంఠాపురంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి హాజరయ్యారు. తొలుత కందుకూరు మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి మాజీ కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయకో, టిడిపి నాయకులు చిలకలపల్లి వెంకటరావు, సుకేష్ చంద్ర పండా, బెజ్జిపురం శంకర్, భవాని గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నూర్పు యంత్రం బోల్తా ; ఇద్దరు మహిళలకు గాయాలు

వీరఘట్టం : వరి నూర్పు యంత్రం బోల్తాపడడంతో మండలంలోని రేగులపాడుకు చెందిన కడగల కంచమ్మ, పార్వతి తీవ్రంగా గాయపడ్డారు. గురువారం సాయంత్రం పొలం పనులు ముగించుకొని అదే యంత్రంపై గృహాలకు చేరుకునేందుకు యంత్రంపై ఎక్కి వస్తుండగా పొలం గట్టు వద్ద యంత్రం బోల్తాపడడంతో వీరు గాయపడ్డారు. దీంతో తోటి రైతులు 108కు సమాచారం అందించడంతో ప్రమాద స్థలానికి చేరుకొని గాయపడ్డారు. వీరికి స్థానిక పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని శ్రీనివాసా కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళ గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్ఐ పాపారావు చెప్పారు. 9ఏళ్లుగా ఒంటరిగా శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్న నైదాన భారతి(34) ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. బుధవారం రాత్రి వేరుగా వుంటున్న భర్త మాధవరావుకు ఆమె ఫోన్ చేసి టిఫిన్ తీసుకు రావాలని కోరగా ఆయన గురువారం టిఫిన్ తీసుకెళ్లాడు. తలుపు తీయాలని కోరినా ఆమె స్పందించకపోవడం తో ఇరుగుపొరుగు వారిని పిలిచి తలుపులు తెరిచారు. బెడ్ రూంలో చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించిందన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాపారావు

9 మందికి జైలు శిక్ష

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌లో 2017లో నమోదైన పేకాట కేసులో 9మందిపై నేరం రుజువైనందున జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు ముద్దాయిలకు ఐదు రోజులు జైలు, రూ.3500 జరిమానా విధించినట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. జరిమానా కట్టనిచో ఒక్కొక్కరికి రెండు వారాలపాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు చెప్పారు.